క్లుప్తంగా

వికసించిన మే పుష్పాలు



విరబూసిన మే పుష్పాలు

గుత్తి: పట్టణంలోని చిన్న మస్తాన్, అజయ్ ఇంటి పెరట్లో సోమవారం మే పుష్పాలు వికసించాయి. పుష్పాలను చూడటానికి చుట్టు పక్కల జనాలు తరలివచ్చారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

గుంతకల్లుటౌన్: ఇంటికో మొక్కను నాటి వాటిని పెంచే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలి. పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు మనుగడ సాధ్యమని భారత రాజ్యాంగ అవగాహన వేదిక అధ్యక్ష, కార్యదర్శులు చొక్కా సునీల్, చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని సోనియా కాలనీలో రాజ్యాంగ అవగాహన వేదిక, హార్ట్‌ఫుల్ నెస్ సంస్థల కార్యకర్తలు మొక్కలను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు సరస్వతి, వేణుగోపాల్, రామక్రిష్ణ, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవంపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

యాడికి: మండల కేంద్రంలో మలేరియాకు వ్యతిరేకంగా వైద్య సిబ్బందితో కలసి యాడికి పీహెచ్‌సీ వైద్యులు శ్రీరామ్ కుమార్, పరమేశ్వర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ దోమల నివారణకు ఇంటి ముందు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు., ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా జూన్ 1 నుంచి 30వ తేదీ వరకూ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు అగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాసులు, రాం ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ నివారణకు కృషి



బాధితులకు పరికరాలు అందజేస్తున్న వైద్య సిబ్బంది

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో ఫ్లోరైడ్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని జిల్లా ఎన్సీడీ అధికారి డాక్టర్ నారాయణస్వామి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో డాక్టర్ స్వాతి లక్ష్మి ఆధ్వర్యంలో ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాలను అందజేశారు. అనంతరం ఫ్లోరైడ్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మోహన్‌రావు, పీహెచ్ఎన్ చెన్నమ్మ, నాగలక్ష్మి, ఈశ్వరమ్మ, సత్య నారాయణ, ధనుంజయ, ఆనంద్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

యాడికి: మండల కేంద్రంలోని నారాయణ స్వామి కాలనీలో సోమవారం రాత్రి చేనేత కార్మికుడు నారాయణ స్వామి(57) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల మేరకు.. నారాయణస్వామి, లక్ష్మి దేవి దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు. పిల్లలందరికీ వివాహాలు చేశారు. ఇటీవల కుమారుడు, కోడలు వేరు కాపురం పెట్టారు. దీంతో కుమార్తెల వివాహాలకు చేసిన అప్పు తీర్చే మార్గం కానరాక, భార్య అంగడికి వెళ్లగా రాత్రి 8 గంటల సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని నారాయణస్వామి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పుట్లూరు: మండలంలోని పి.చింతలపల్లి చెరువు కట్ట సమీపంలో సోమవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో రామ మోహన్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని బంధువులు చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారు.

యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని యంగన్నపల్లి శివారులో సోమవారం ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి మరో బైక్ ఢీకొట్టడంతో నవీన్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. బేతాపల్లికి చెందిన నవీన్ గుత్తి వైపు వెళ్తూ ముందు వెళ్తున్న మరో బైక్‌ను కొన్నాడు. తీవ్రంగా గాయపడిన నవీన్‌ను స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జడ్జిమెంట్ డే

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న పూర్తికాగా నేడు కౌంటింగ్ నిర్వహించనున్నారు. దీంతో అభ్యర్థులతో పాటు నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గతంలో కంటే ఓటింగ్ శాతం పెరగడంతో విజయం ఎవరిని వరిస్తుందో, ఎవరికెన్ని ఓట్లు వస్తాయోనని పోలింగ్ బూత్‌ల వారీగా రాజకీయ విశ్లేషకులు లెక్కలు తీస్తున్నారు. తాడిపత్రి, గుంతకల్లు, శింగనమలలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, కాంగ్రెస్, ఇతర పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు బరిలో ఉన్నా ప్రధాన పోటీ వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్య నెలకొంది.



తాడిపత్రిలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటర్లు (ఫైల్)

- ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- సంయమనం పాటించాలని పోలీసుల సూచన

తాడిపత్రిరూరల్/టౌన్: తాడిపత్రి నియోజకవర్గ చరిత్రలో మొట్టమొదటి సారిగా రెండు ప్రధాన పార్టీలూ కౌంటింగ్ ఏజెంట్లుగా అడ్వకేట్లను నియమించుకుని రికార్డు సృష్టించాయి. తాడిపత్రి శాసన సభకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కేతిరెడ్డి పెద్దారెడ్డి, టీడీపీ తరఫున జేసీ అస్మిత్ రెడ్డి బరిలో నిలిచారు. గత నెల 13న జరిగిన పోలింగ్ సందర్భంగా జరిగిన అల్లర్లు, రాళ్ల దాడులకు సంబంధించి వైఎస్సార్‌సీపీ, టీడీపీకి చెందిన నాయకులు, మద్దతుదారులు పరారీలో వున్నారు. ఆయా కేసుల్లో పలువురు టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే రెండు పార్టీలకు చెందిన వంద మందికి పైగా అల్లరి మూకలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం జైలుకు పంపారు. మిగిలిన వారి కోసం గాలింపు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కౌంటింగ్ ఏజెంట్ల కోసం రెండు పార్టీలూ వివాదాలకు దూరంగా ఉంటూ నేర చరిత లేని వారి కోసం ప్రయత్నించారు. పోలీసుల కేసులు, ఇతర కారణాల వల్ల అలాంటి వారు కౌంటింగ్ ఏజెంట్లుగా కూర్చోవడానికి ముందుకు రాలేదు. ఈ క్రమంలో అవగాహన లేని వారిని ఏజెంట్లుగా పెట్టుకుని టెన్షన్ పడే కంటే అడ్వకేట్లను ఏజెంట్‌గా కౌంటింగ్‌లో కూర్చోబెడితే ఎలా ఉంటుందని ఎమ్మెల్యే పెద్దారెడ్డి సీనియర్ నాయకులతో సమాలోచనలు చేశారు. అన్ని విధాలా మంచి నిర్ణయంగా వారందరూ చెప్పడంతో తాడిపత్రితోపాటు జిల్లా కేంద్రంలోని సన్నిహితంగా ఉన్న పార్టీ శ్రేయోభిలాషులైన అడ్వకేట్లను పోలింగ్ ఏజెంట్లుగా కూర్చోపెడుతున్నట్లు ఎన్నికల అధికారులు, పోలీసు అధికారులకు తెలిపి మరీ వారి చేత దరఖాస్తు చేయించారు. ఈ పద్ధతిని టీడీపీ నాయకులు కూడా అనుసరించి పోలింగ్ ఏజెంట్లుగా అడ్వకేట్లను ఏర్పాటు చేసుకున్నారు. పోలింగ్ ఏజెంట్లుగా వైఎస్సార్‌సీపీ నుంచి 16 మంది, టీడీపీ నుంచి 10 మందికి పైగా న్యాయవాదులను నియమించుకున్నట్లు తెలుస్తోంది.

పోస్టల్ బ్యాలెట్‌తో మొదలు..

జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూలో మంగళవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో కౌంటింగ్ పక్రియ ప్రారంభం కానుంది. మొత్తం 274 పోలింగ్ కేంద్రాలకు 14 టేబుళ్లలో 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేయనున్నారు. నియోజక వర్గంలో మొత్తం 2,48,880 ఓటర్లకు గాను 2,06,701 మంది ఓటర్లు ఓటు వేశారు. వీరిలో పురుషులు 1,,02,898 మంది, మహిళలు 1,,03,790, ఇతరులు 13 మంది ఉన్నారు. ఓట్ల లెక్కింపు పెద్దవడుగూరు మండలం కాశేపల్లి నుంచి ప్రారంభమై తాడిపత్రి పట్టణంలోని ట్రిబుల్ ఎస్ఆర్‌ఎం హైస్కూల్ వద్ద ముగుస్తుంది. పెద్దవడుగూరు మండలంలో 1వ పోలింగ్ కేంద్రం నుంచి 46 పోలింగ్ కేంద్రం మొలకతాళ్ల కేంద్రం, యాడికి మండలంలో కేశవరాయునిపేటలోని 47వ పోలింగ్ కేంద్రం నుంచి చిక్కేపల్లి నిట్టూరులోని 102 పోలింగ్ కేంద్రం, పెద్దపప్పూరు మండలంలోని చీమలవాగుపల్లిలోని 103 పోలింగ్ కేంద్రం నుంచి 140 పోలింగ్ కేంద్రం వరకూ, తాడిపత్రి మండలం బ్రహ్మణపల్లిలోని 141 పోలింగ్ కేంద్రం నుంచి 199 పోలింగ్ కేంద్రం వరకూ, తాడిపత్రి పట్టణంలోని సంకుశమ్మ పాలెంలోని 1వ వార్డు స్కూల్‌లోని 200 పోలింగ్ కేంద్రం నుంచి శ్రీనివాసపురంలోని ట్రిబుల్ ఎస్ఆర్ఎం హైస్కూల్‌లోని 274 పోలింగ్ కేంద్రం వద్ద కౌంటింగ్ ముగియనుంది. కాగా కౌంటింగ్‌ను పురస్కరించుకుని ఉదయం నుంచి రాత్రి వరకూ తాడిపత్రి పట్టణంతోపాటు నియోజకవర్గాల్లోని దుకాణాలను మూసివేయాలని పోలీసులు యజమానులకు సూచించారు. తాడిపత్రి పట్టణానికి వచ్చే అన్ని రహదారులను తాత్కాలికంగా మూసివేసి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి, జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇళ్ల వద్ద ముందుజాగ్రత్తగా సీసీ కెమెరాలను బిగించడమే కాక భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. వారి ఇళ్లకు వెళ్లే రహదారుల్లో బారికేట్లను ఏర్పాటు చేసి భారీ బందోబస్తును నియమించారు. కాగా కౌటింగ్ మరో కొన్ని గంటల్లో ప్రారంభం కానుండటంతో బెట్టింగ్ రాయుళ్లు టెక్షన్‌తో సతమతమవుతున్నారు. రాష్ట్రంలో ఏర్పడే ప్రభుత్వంతోపాటు తాడిపత్రిలో గెలిచే అభ్యర్థిపై కోట్లాది రూపాయల బెట్టింగ్ జరిగింది. దీంతో ఎప్పుడు తెల్లారుతుందా, ఎప్పుడు కౌటింగ్ ప్రారంభమై ఫలితాలు వస్తాయా? అన్న ఉత్కంఠతతో అటు బెట్టింగ్ రాయుళ్లు ఇటు ప్రధాన పార్టీల నాయకులు, అభిమానులు, ప్రజలు ఎదురు చూస్తున్నారు.

సర్వం సిద్ధం

శింగనమల: జేఎన్‌టీయూలో భద్రపరిచిన శింగనమల అసెంబ్లీకి సంబంధించిన కౌంటింగ్ మంగళవారం చేపట్టనున్నారు. శింగనమల అసెంబ్లీకి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వీరాంజనేయులు, టీడీపీ అభ్యర్థిగా బండారు శ్రావణిశ్రీ, కాంగ్రెస్ అభ్యర్థిగా సాకే శైలజానాథ్, బీఎస్పీ అభ్యర్థిగా కుందనం గౌతమి, ఆల్ ఇండియా కిసాన్ జనతా పార్టీ అభ్యర్థిగా కప్పల నాగరాజు, జైభీంరావు భారత్ పార్టీ అభ్యర్థిగా జి.రామాంజనేయులు, తెలుగు రాజాధికార సమితి పార్టీ అభ్యర్థిగా వెంకటసుబ్బన్న, జైమహాభారత్ పార్టీ అభ్యర్థి సాకే శ్రీదేవి, ఇండిపెండెంట్లు ఎం.ఆనంద్‌కుమార్, కాయల రాంమొహన్, కొడమల ఓబిలేసు, ఎం. మాధవ, మిద్దె నల్లప్ప, వి.సాయిప్రసాద్ పోటీలో ఉన్నారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్యనే పోటీ ఉంది.

పోలైన ఓట్లు..

శింగనమల నియోజకవర్గంలో 2,47,373 మంది ఓటర్లుండగా, అందులో 2,05,642 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరితో పాటు పోస్టల్ బ్యాలెట్ ద్వారా అసెంబ్లీకి 2,024 మంది, సర్వీస్ ఓట్లు 195 మంది ఓటు వేశారు. నియోజకవర్గంలో 293 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలలో మొదటగా గార్లదిన్నె మండలం పెనకచెర్ల డ్యాం నుంచి కౌంటింగ్ ప్రారంభమై యల్లనూరు మండలం నీర్జాంపల్లితో ముగుస్తుంది. కౌంటింగ్‌లో ఏర్పాటు చేసిన 14 టేబుల్స్‌లో ప్రతి రౌండుకు 14 ఈవీఎంల ఓట్లను లెక్కింపు చేయనున్నారు. ఈ విధంగా 21 రౌండ్లలో లెక్కింపు పూర్తి చేయనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

గుంతకల్లు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కౌంట్ డౌన్ మొదలైంది. నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా చూసిన కౌంటింగ్ పైనే చర్చలు. ఇద్దరు ఒకచోట కలిస్తే చాలు విజయం ఎవరిని వరిస్తుందనే అంశంపై జోరుగా విశ్లేషణలు చేసుకున్నారు. దీంతో పాటు పోటీలో ఉన్నా ప్రధాన పార్టీ అభ్యర్థులు గెలుపు ఓటములపై భారీగా పందేలు జరిగాయి. మంగళవారం అభ్యర్థుల భవిష్యత్ తేలనుంది. అనంతపురంలోని జేఎన్‌టీయూలోని మొదటి అంతస్తులోని సౌత్ వింగ్ ప్రధాన భవనంలోని రూమ్ నంబర్2లో కౌంటింగ్ అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గంలో 2,70,648 ఓటర్లు ఉండగా 2,03,820 మంది ఓటు వేశారు. పోస్టల్ బ్యాలెట్ 3026 ఉన్నాయి. కాగా 2019 ఎన్నికల్లో గుంతకల్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వై.వెంకటరామిరెడ్డి టీడీపీ అభ్యర్థి ఆర్.జితేంద్రగౌడ్‌పై దాదాపు 48,532 ఓట్లతో భారీ విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కూడా టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాంపై వైవీఆర్ విజయం సాధిస్తారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గుంతకల్లు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలతోపాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఆయన విజయనికి బాసటగా నిలువనున్నాయి.

కౌంటింగ్‌కు ప్రజలు సహకరించాలి

గార్లదిన్నె: కౌంటింగ్ సందర్భంగా ప్రజలు అల్లర్లకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని శింగనమల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు, ప్రత్యేక డీఎస్పీ విజయభాస్కర్‌రావు సూచించారు. సోమవారం ఆయన గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మండలంలో శాంతిభద్రతలపై ఆరా తీశారు.కౌంటింగ్ సందర్భంగా మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఇళ్ల నుంచి ఎవరూ అనవసరంగా మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లకూడదన్నారు. అలాగే విజయోత్సవ ర్యాలీలు, టపాకాయలు కాల్చడం వంటివి చేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజలంతా ప్రశాంతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీధర్, ఎస్ఐ మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

పుట్లూరు: నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఎన్నికల ఫలితాల నేపథ్యంలో తాడిపత్రి, అనంతపురం పట్టణాలకు వెళ్లడానికి ప్రయత్నించవద్దని సీఐ సుబ్రమణ్యం సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవాలు నిర్వహించరాదన్నారు. పుట్లూరు మండలంలో 70 మంది పోలీస్ సిబ్బందితో పాటు బీఎస్ఎఫ్ బలగాలతో గస్తీ ఏర్పాటు చేశామన్నారు.

యల్లనూరు: కౌంటింగ్ సందర్భంగా మంగళవారం 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉందని టీడీపీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు తాడిపత్రి, అనంతపురం పట్టణాలకు వెళ్లకూడదని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం సూచించారు. సోమవారం సీఐ మాట్లాడుతూ కౌంటింగ్ అనంతరం బాణసంచా కాల్చడం, రెచ్చగొట్టే మాటలు మాట్లాడినా కేసులు కడతామన్నారు. అలాగే మండలంలోని కల్లూరు, శింగవరం, తిమ్మంపల్లి, చింతకాయమంద, గొడ్డుమర్రి, బుక్కాపురం తదితర గ్రామాల్లో ఎస్ఐ గిరిబాబు పర్యటించి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు.

సంక్షిప్త సమాచారం

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

బుక్కరాయసముద్రం: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన ఈదురు గాలులు, వర్షాలకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మండల కేంద్రంలో 9 విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో బీకేఎస్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ట్రాన్స్‌కో ఏఈ ప్రతాప్‌కుమార్ ప్రత్యేక బృందంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

కంపచెట్ల తొలగింపు

పామిడి: మండలంలోని ఎద్దులపల్లి-పాళ్యంరోడ్డుకు ఏపుగా పెరిగిన కంపచెట్లను సోమవారం తొలగింపజేశారు. కంపచెట్ల వల్ల వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యేవారు. గుంతకల్లు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు ఎద్దులపల్లి గ్రామ సర్పంచ్ జీ వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు జీ వీరాంజనేయులు జేసీబీతో రోడ్డుకు ఇరువైపులా గల కంపచెట్లను తొలగింపజేసి రాకపోకలకు సుగమం చేశారు. దీంతో ఎద్దులపల్లి, పాళ్యం గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే వైవీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వరప్రసాద్

గుంతకల్లు: స్థానిక హనుమేష్‌నగర్‌లోని శ్రీ శంకరనంద జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డీబీఆర్ఎస్ వరప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న వరప్రసాద్‌కు పదోన్నతి కల్పిస్తూ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించినట్లు కరస్పాండెంట్ హరి తెలిపారు. ప్రిన్సిపాల్‌ను సహచర అధ్యాపకులు అభినందించారు.

విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ కె.జనార్దన్‌నాయుడు, చిత్రంలో సీఐలు



తాడిపత్రి జూనియర్ కళాశాల మైదానంలో పహారా

తాడిపత్రి అర్బన్: కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు, బాణా సంచా కాల్చేందుకు అనుమతి లేదని తాడిపత్రి డీఎస్పీ కె.జనార్దన్ నాయుడు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల అనంతరం తాడిపత్రిలో చోటు చేసుకున్న అల్లర్ల దృష్ట్యా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు. తాడిపత్రి నియోజకవర్గ వ్యాప్తంగా 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్‌యాక్టు అమలులో ఉందన్నారు. అయితే సాధారణ ప్రజా జీవనానికి ఎటువంటి ఇబ్బందిలేదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు. కౌంటింగ్ కేంద్రానికి ఎవరూ వెళ్లకూడదని విజ్ఞప్తి చేశారు. తాడిపత్రిలో అల్లర్ల ఘటనల తరువాత ఇప్పటి వరకు 212 మందిపై రౌడీషీట్లు తెరిచామన్నారు. ఎన్నికలకంటే ముందు 2,168 మందిని బైండోవర్ చేశామని, పోలింగ్ అనంతరం జరిగిన అల్లర్లలో పాల్గొన్న 627 మందిని బైండోవర్ చేశామన్నారు. 60 మంది ట్రబుల్‌మాంగర్స్‌ను గ్రామ బహిష్కరణ చేసేందుకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపామని, ఆదేశాలు వచ్చిన వెంటనే వారిని గ్రామాల నుండి బహిష్కరిస్తామని డీఎస్పీ తెలిపారు. ఇప్పటి వరకు 133 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. అనవసరంగా పోలీసు కేసుల్లో ఇరుక్కుని జీవితాలను నాశనం చేసుకోకుండా జాగ్రత్త పడాలన్నారు. అందరిపై 307 సెక్షన్ కింద కేసులు కూడా నమోదు చేశామని, అల్లర్లలో పాల్గొన్న వారికి బెయిల్ కూడా రాదన్నారు. తాడిపత్రి పట్టణం చుట్టూ 7 పోలీస్ చెక్ పోస్టులు, 48 పికెట్స్‌ను ఏర్పాటు చేయడంపాటు, ఫోర్ వీల్ మొబైల్స్ 19, 23 టూవీలర్ మొబైల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. మద్యం దుకాణాలను మూడు రోజుల పాటు బంద్ చేశామన్నారు. 467 మంది పోలీసులను నియోజకవర్గ వ్యాప్తంగా బందోబస్తుకు నియమించామన్నారు. ఆయా మండలాల్లోని తహసీల్దార్లు కూడా కౌంటింగ్ సందర్భంగా పర్యవేక్షిస్తుంటారన్నారు. ఎవరు గెలిచిన, ఓడినా సంయమనం పాటిస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడకుండా ఉండాలని హితవు పలికారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, ఆ పోస్టులను షేర్ చేసినా నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోషల్‌మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో సీఐలు నాగేంద్రప్రసాద్, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్ఐ గౌస్‌బాషా పాల్గొన్నారు.

పోలీసు దిగ్బంధనంలో తాడిపత్రి

తాడిపత్రి అర్బన్: కౌంటింగ్ సందర్భంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. పోలింగ్ సందర్భంగా తాడిపత్రిలో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. డీఎస్పీ కె.జనార్దన్‌నాయుడు నేతృత్వంలో సీఐలు బి.శ్రీనివాసులు, వెంకటశివారెడ్డి, శివబాస్కర్‌రెడ్డి, నరసింగప్పలు బారీ బందోబస్తును నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పోలీసులు నియోజకవర్గాన్ని తమ అధీనంలోకి తీసుకున్నాయి. ఎలాంటి హింసాత్మక ఘటనలకు తావు లేకుండా పోలీసులు ముందస్తు చర్యలకు ఉపక్రమించారు. నియోజకవర్గమంతటా 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్‌యాక్టు అమలు చేస్తున్నారు. ఇప్పటికే మద్యం దుకాణాలను కూడా బంద్ చేశారు. తాడిపత్రిలోకి ప్రవేశించే మార్గాల్లో పోలీసులు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. కొత్త వ్యక్తులు ఎవరైనా పట్టణంలోకి వచ్చారా అన్న అనుమానంతో లాడ్జీల్లో కూడా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులకు ఎవరికి లాడ్జీల్లో గదులు అద్దెకు ఇవ్వకూడదని పోలీసులు లాడ్జీల నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. అలాగే ఎమ్మెల్యే అభ్యర్థుల నివాసాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేశారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచండి

పెద్దపప్పూరు: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో టపాసులు పేల్చడం, డీజేలు పెట్టడం, ర్యాలీలు చేయడం నేరమని తాడిపత్రి డీఎస్పీ జనార్ధన్ నాయుడు అన్నారు. సోమవారం ఆయన పెద్దపప్పూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసి, బండోవర్ కేసుల నమోదుపై ఆరా తీశారు. మండల వ్యాప్తంగా అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎటువంటి సమస్య ఉన్న ఉన్నతాధికారులకు తక్షణమే సమాచారం అందించాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు.

144 సెక్షన్ అమలు

శింగనమల: కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో 144 సెక్షన్, 30 యాక్ట్ అమలు చేయనున్నట్లు శింగనమల సీఐ శ్రీధర్ తెలిపారు. సర్కిల్ పరిధిలోని శింగనమల, గార్లదిన్నె, నార్పల మండలాల్లో కౌంటింగ్ సందర్భంగా బాణ సంచా కాల్చడం, రెచ్చగొట్టే మాటలు మాట్లాడం, ఊరేగింపులు , ర్యాలీలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు

పామిడి: కౌంటింగ్ అనంతరం ర్యాలీలు, సంబరాలు, రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తే చర్యలు చేపడతామని సీఐ ఎం రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన స్పెషల్‌పార్టీ పోలీసులతో పాళ్యంతండాలో కవాతు నిర్వహించి అవగాహన కల్పించారు. మంగళవారం ఓట్ల లెక్కింపు (కౌటింగ్) దృష్ట్యా ఎవరూ బయటకు రాకూడదన్నారు. ఇప్పటిదాకా మండలంలో 580 మందిని బైండోవర్ చేశామన్నారు.

పొంగిన వాగులు, వంకలు



పెద్దవడుగూరు మండలంలో వర్షపు నీటితో పోటెత్తిన పందులవాగు

గుత్తి/గుత్తి రూరల్: మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకూ భారీ వర్షం కురిసింది. 62.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ భారతి తెలిపారు. కుండ పోత వర్షంతో లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. రాత్రి 8.30 గంటల నుంచి అర్ధరాత్రి 12.30 గంటల వరకూ కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కాగా భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

పామిడి: పామిడిలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ భారీ వర్షం కురిసింది. స్థానిక పోలీస్‌స్టేషన్, పంచాయతీ కార్యాలయం, గుండప్పరావు కాలనీ తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులకు పలు చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు పడిపోయి కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలైన టీసీ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మదీనా కాలనీలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లాయి.

పెద్దవడుగూరు: మండలంలో ఆదివారం రాత్రి 11 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకూ భారీ వర్షం కురిసింది. దీంతో వంకలు, వాగులు వర్షం నీటితో పోటెత్తాయి. పెద్దవడుగూరు సమీపంలోని పందుల వాగు వర్షం నీటితో పోటెత్తింది. పని మీద స్కూటీ లో అనంతపురం వెళ్తున్న కుమార్ అనే వ్యక్తి స్కూటీతో పాటు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. అయితే కుమార్ ఈత కొట్టుకుంటూ దరికి చేరగా స్కూటీ కొట్టుకుపోయింది. నీటి ప్రవాహం తగ్గిన అనంతరం గ్రామస్తులు స్కూటీని బయటకు తీశారు. వర్షం నీటి ప్రవాహానికి పి.వీరన్నపల్లి వద్ద పెద్దవంకపై ఏర్పాటు చేసుకున్న రహదారి ధ్వంసమైంది. దీంతో రాకపోకలు ఆగిపోయాయి.

తాడిపత్రిటౌన్: తాడిపత్రి నియోజకవర్గ వ్యాప్తం సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. నియోజకవర్గంలో ఆయా మండలాల వారిగా కురిసిన వర్షంను పరిశీలిస్తే తాడిపత్రి 8.2 మి.మీ, యాడికి 32.0 మి.మీ, పెద్దపప్పూరు 5.2 మి మీ, పెద్దవడుగూరు 56.2 మి మీ నమోదైంది.

యల్లనూరు: మండలవ్యాప్తంగా ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో అన్నదాతలకు ఊరట లభించింది. ఎండుతున్న పంటలకు కాస్త ఉపశమనం కల్గింది. అక్కడక్కడ అరటి రైతులకు నష్టం వాటిల్లింది.



గుత్తి ఆర్ఎస్‌లోని చెర్లోపల్లికి వెళ్లే రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన స్కూటీని బయటకు తీస్తున్న దృశ్యం



పామిడి పోలీస్‌స్టేషన్ ఆవరణలో నేలకొరిగిన వేపచెట్టు